

# విభారే

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 07 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 81 పేజీలు : 4 వెల : రూ


# సందడిగా జగనన్న సంకల్ప యాత్ర నాలుగేళ్ల పండగ





**అమరావతి:** టెక్కలిలో సీఎం వైఎస్ జగన్ పాదయాత్ర నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి పాదయాత్రను ప్రారంభించారు.

గుంటూరులో..వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, మేయర్ కావటి మనోహర్ నాయుడు గుంటూరు నగరపాలెంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి హిమని సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో..గూడూరులో జనహృదయనేత సీఎం జగన్ ప్రజా సంకల్ప యాత్ర నేటితో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ వైఎస్సార్ విగ్రహం నుంచి సాదుపేట సెంటర్ వరకు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో..సీఎం జగన్ పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆళ్ళగడ్డ నాలుగు రోడ్ల కూడలిలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.ప్రజా సంకల్ప యాత్ర నాలుగేళ్లు పూర్తి చేసికున్న సందర్భంగా వైఎస్సార్ విగ్రహనికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తుడా సర్కిల్ లో వైఎస్సార్ విగ్రహం వద్ద సర్వమత ప్రార్ధనలు, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తుడా వైఎస్సార్ సర్కిల్ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీషా, కార్పొరేటర్‌లు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 10 ఏళ్లు పడ్డ కష్టం ప్రజలందరికీ తెలుసు.నాడు వైఎస్ పాదయాత్రతో ఎలా ప్రభంజనం సృష్టించారో, అదే సంకల్పంతో వైఎస్ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టారు. ప్రజలు కష్టాలు తెలుసుకుని, రెండు పేజీలు మ్యానిఫెస్టోలో పెట్టి నవరత్నాలుగా మార్చి ప్రజలకు అందించారు. కోట్లాది మంది ప్రజల కష్టాలు తెలుసుకుని ఈరోజు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తున్నారు. చంద్రబాబు నిరంతరం దూషిస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా నిరంతరం సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం అయ్యింది. చంద్రబాబు ఎన్నికుట్రలు చేసినా ప్రజలు మాత్రం వైఎస్ జగన్‌కే పట్టం కట్టారు. 3,648 కి.మీ ప్రజా సంకల్ప పాదయాత్ర సువర్ణ చరిత్ర అని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లాలో..సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పెనుకొండలో మంత్రి శంకరనారాయణ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శంకర్ నారాయణ, ఎమ్మెల్సీ వెన్నుపూస గోపాల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. తిరుపతి: ప్రజాసంకల్ప పాదయాత్ర 4 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పూర్తి చేసిన ఘనత మన ముఖ్యమంత్రికి దక్కుతుంది. విపక్ష నేత చంద్రబాబు పూటకో మాట మాట్లాడుతున్నారు. అధికారంలో ఉంటే ఒకలా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా మాట్లాడుతున్నారు. ఆయన మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు..ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నిడమర్రు మండలం బువ్వనపల్లిలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించాయి. విజయవాడలో..సీఎం వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు నిర్వహించారు. మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు ఈ సంబరాల్లో పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ భాగ్యలక్ష్మి పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. చిత్తూరు జిల్లావైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. కుప్పంలో వైఎస్ జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు, నేతలు పాలాభిషేకం చేశారు. ప్రజా సంకల్ప యాత్రను గుర్తుచేసుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ఎండనక వాననక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్ర దేశ చరిత్రలో నిలిచి పోయిందని అంటున్నారు.వైఎస్సార్ జిల్లాముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రజాసంకల్పయాత్ర నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేంపల్లెలో వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి నుండి రాయచోటి బైపాస్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చిత్తూరు జిల్లా నాయకులు

### వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం జగన్‌దే: ఎమ్మెల్యే ఆర్కే రోజా



# ప్రజాసంకల్ప పాదయాత్ర ఒక చరిత్ర: సజ్జల



తూర్పుగోదావరి: ప్రజాసంకల్ప పాదయాత్ర ఒక చరిత్రగాప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి అభివర్ణించారు. ప్రజాసంకల్ప యాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను చూసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. అన్ని వర్గాలనూ ఆదుకునేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. కరోనా సంక్షోభంలోనూ సంక్షేమ పథకాల అమలుకు సీఎం జగన్ వెనుకాడలేదని గుర్తుచేశారు.ప్రజలు సీఎం వైఎస్ జగన్‌వైపే నిలిచారని సజ్జల అన్నారు. సంక్షేమాన్ని అడ్డుకోవడమే ప్రతిపక్షానికి తెలిసిన రాజకీయమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభించి నేటికి నాలుగేళు పూర్తి అయింది. నవంబర్6, 2017న ఇడుపులపాయలో ఆయన ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. సాక్షి, కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. పాదయాత్ర ద్వారా సీఎం జగన్ ప్రజలతో మమేకమాయ్యరని పేర్కొన్నారు. అధికారం చేపట్టగాలనే సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ నడుంబిగించారని తెలిపారు. రూ.లక్షా 40 వేల కోట్లు పేద ప్రజల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. సాగునీటి సమస్యల లేకుండా చూడాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు.

## జగన్ జనం నడ్డి విరగ్గొడుతున్నారు : సోమిరెడ్డి

అమరావతి: సీఎం జగన్ జనం నడ్డి విరగ్గొడుతున్నారని.. బార్డర్‌లో బంకులను మూసి వేస్తున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ముడిచమురు ధరలు పెరిగినప్పుడల్లా.. ఏపీలో పన్నులు పెంచుకుంటూ ఆదాయమే చూసుకున్నారన్నారు. కేంద్రం సహా పలు రాష్ట్రాలు పెట్రో ధరలు తగ్గించినా.. జగన్ మాత్రం ఎప్పటిలాగే తన రివర్స్ విధానాన్ని కొనసాగిస్తున్నారని సోమిరెడ్డి పేర్కొన్నారు. పన్నులు తగ్గించకపోవడంతో పెట్రోల్ బంకులు మూతపడుతుండగా.. మద్యం తక్కువ ధరకే అక్రమంగా పోటెత్తుతోందన్నారు. పెట్రోల్, బ్రాండెడ్ మద్యం కోసం ఇక్కడి ప్రజలు సరిహద్దులు దాటుతుంటే.. గంజాయి కోసం మాత్రం దేశమంతా ఏపీ వైపు చూస్తోందని సోమిరెడ్డి పేర్కొన్నారు.



# దేశాభివృద్ధిలో విద్యదే కీలక భూమిక



### కృష్ణా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

విజయవాడ నవంబర్ 6 దేశాభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, విద్య ఒక దేశానికి వెన్నెముకగా ఉంటిదని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరించందన్ అన్నారు. విద్యాసంస్థలు ఉత్పత్తి చేసే మానవ వనరులు దేశ పురోగతిలో అత్యంత నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయన్నారు. మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఐదవ స్నాతకోత్సవానికి కులపతి హోదాలో గవర్నర్ హాజరయ్యారు. విజయవాడ రాజ్ భవన్ నుండి వెబినార్ విధానంలో గవర్నర్ ప్రసంగించారు. హరిచందన్ మాట్లాడుతూ విద్యార్జన నాగరికతకు చిహ్నమని, దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక సంస్కరణలను తీసుకురావడానికి ఉన్నత విద్య ఒక ముఖ్యమైన సాధనంగా పరిగణించ బడుతుందన్నారు.ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం ద్వారా నిపుణులను తీర్చిదిద్దడం ఉన్నత విద్యా సంస్థల ముఖ్యమైన లక్ష్యం కావాలని, నాణ్యత విషయంలో రాజీ పడరాదని స్పష్టం చేసారు. కరోనా వల్ల డిజిటల్ టెక్నాలజీలను ప్రత్యామ్నాయ బోధనా వ్యవస్థగా స్వీకరించవలసిన పరస్థితి ఏర్పడిందని ఈ క్రమంలో ఎదురవుతున్న సవాళ్లను అధికమించాలని సూచించారు. ముఫై నాలుగేళ్ల విద్యా వ్యవస్థలో జాతీయ విద్యా విధానం 2020 అతి పెద్ద సంస్కరణ కాగా. ఆ ఫలాలను అందిపుచ్చుకోనున్న ఈ తరం విద్యార్థులు నిజంగా అదృష్ట వంతులన్నారు. ప్రధాన మంత్రి నాయకత్వంలో భారతదేశం ప్రపంచ స్థాయి 'ఎడ్యుకేషనల్ హబ్'గా రూపుదిద్దుకోనుందన్నారు. మౌలిక సదుపాయాల సమస్యలను అధిగమించి విశ్వవిద్యాలయం రుద్రవరంలోని స్వంత క్యాంపస్ నుండి పనిచేయడం శుభపరిణామమన్నారు.కృష్ణా విశ్వవిద్యాలయం 2020-21 విద్యా సంవత్సరంలో ఐఎస్ఓ 9001:2015 - క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ సర్టిఫికేషన్‌ను పొందడం, ప్రస్తుత విద్యా సంవత్సరంలో న్యాక్ అక్రిడిటేషన్‌ను సాధించేందుకు సన్నాహాలు చేయడం హర్షణీయమని గవర్నర్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత ప్రభుత్వ రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి డాక్టర్ జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పోటీకి అనుగుణంగా భారతీయ విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత అచార్య ఎన్. బాలకృష్ణన్ కు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసారు. నాగార్జునా విశ్వవిద్యాలయం ఉపకులపతి అచార్య కె.బి.చంద్ర శేఖర్, రిజిస్ట్రార్ అచార్య రామిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొనగా, విజయవాడ రాజ్ భవన్ నుండి గవర్నర్ సంయిక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్, కృష్ణా విశ్వ విద్యాలయం జర్నలిజం శాఖ అధిపతి డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ అభివృద్ధి వాహనం రివర్స్ గేర్‌లో ఉంది: రాహుల్

న్యూఢిల్లీ: ఎల్‌పీజీ (వంటగ్యాస్) ధరలు రోజురోజుకూ పెంచుతూ పోతుండటంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తప్పుపట్టారు. ప్రధాని మోదీ "అభివృద్ధి వాహనం రివర్స్ గేర్‌లో పోతోంది" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



అభివృద్ధి అంటూ వారు చెబుతున్న మాటలకూ, చేస్తున్న చేతలకూ పొంతనే లేదంటూ శనివారంనాడు ఆయన ఓ ట్వీట్ చేశారు."అభివృద్ధి కనుచూపు మేరలో కనిపించడం లేదు. లక్షలాది మంది ప్రజలకు మళ్లీ కట్టెల పొయ్యల వాడకం తప్పేలా లేదు. మోదీజీ అభివృద్ధి వాహనం రివర్స్ గేర్‌లో పోతోంది. బ్రేకులు కూడా ఫెయిలయ్యాయి" అంటూ రాహుల్ ఆ ట్వీట్‌లో విమర్శించారు. ఆ ట్వీట్‌కు ఒక వార్తా కథనాన్ని స్క్రీన్‌షాట్ తీసి షేర్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 42 శాతం ప్రజలు ఎల్‌పీజీ సిలెండర్ల వాడకం మానేశారని, ఎల్‌పీజీ ధరలు విపరీతంగా పెంచేయడమే దీనికి కారణమని ఆ వార్తా కథనం పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు తిరిగి కట్టెపొట్టల వాడకాన్ని ఆశ్రయించక తప్పడం లేదని కూడా తెలిపింది.

# నా యాత్ర.. నా ప్రయాణం ప్రజల కోసమే: సీఎం జగన్



అమరావతి: దేశ రాజకీయాల్లోనే ఓ సంచలనం సృష్టించిన చరిత్రాత్మక 'ప్రజా సంకల్ప యాత్ర' చేపట్టి నేటితో సరిగ్గా నాలుగేళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. "ప్రజా సంకల్ప యాత్రకు తొలి అడుగు పడి నేటికి నాలుగేళ్లు. నాడు నేడూ నా యాత్ర, నా ప్రయాణం ప్రజల చేత, ప్రజల వల్ల, ప్రజల కోసమే. మీ అందరి ఆత్మీయతలు, నమ్మకం, అనురాగాలతో ఈ యాత్ర కొనసాగుతోందని" సీఎం వైఎస్ జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 07 నవంబరు 2021

## భారత్ భూభాగంలో నూతన గ్రామా న్ని నిర్మించిన చైనా

డ్రాగన్ కుట్రలు మరోసారి బయటపడ్డాయి. భారత్పై చైనా కుట్రలను గుర్తించింది అంతర్జాతీయ సమాజం. చైనా సైన్యం హద్దు దాటి ప్రవర్తిస్తోందని మరోసారి స్పష్టమైంది. భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. అమెరికా రక్షణశాఖ విడుదల చేసిన వార్షిక నివేదికలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవాధీన రేఖ దాటి వచ్చి అరుణాచల్ ప్రదేశ్లో 100 ఇళ్లతో కొత్త గ్రామాన్ని సృష్టించుకుంది చైనా. దీనికి సంబంధించిన నివేదికను యూఎస్ కాంగ్రెస్కు సమర్పించింది అమెరికా రక్షణ శాఖ. భారత భూ భాగంగా గుర్తించిన ప్రాంతంలోనే చైనా ఈ నిర్మాణం చేపట్టడం గమనార్హం. మెక్మోహన్ రేఖకు దక్షిణాన భారత సరిహద్దుల్లో ఈ గ్రామం నిర్మించారని బయటపడింది. అరుణచల్ప్రదేశ్లో డ్రాగన్ దేశం ఒక గ్రామాన్నే నిర్మించి న విషయంపై శాటిలైట్ చాయాచిత్రం ఆధారంగా ఓ జాతీయ మీడియా ఈ ఏడాది ప్రారంభంలో ఓ వార్తా కథనం ప్రచురించింది. 2020లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, ఎల్ఏటీ తూర్పు సెక్టార్లో టిబెట్ అటానమస్ రీజియన్, భారత్లోని అరుణాచల్ ప్రదేశ్ మధ్య వివాదాస్పద భూభాగంలో 100 ఇళ్లతో ఓ గ్రామాన్ని నిర్మించింది అని ఓ నివేదిక వెల్లడించింది. ఈ గ్రామం అరుణాచల్ ప్రదేశ్లోని ఎగువ సుబాన్సిరి జిల్లాలోని సారి చు నది ఒడ్డున ఉంది. ఈ ప్రాంతం 1962 యుద్ధానికి ముందు కూడా భారతదేశం– చైనా సైనికుల మధ్య ఘర్షణలను దారితీసింది. చైనా పదేళ్లకు పైగా ఈ ప్రాంతంలో చిన్న సైనిక స్థావరాన్ని నిర్వహిస్తోంది. అయితే భారత భూభాగంలోకి మరింత చొచ్చుకొని 2020లో అది పూర్తి స్థాయి గ్రామాన్ని నిర్మించుకుంది. అంతేకాకుండా అదే ప్రాంతంలో రహదారి నిర్మాణాలు కూడా ఏర్పాటు చేస్తోంది డ్రాగన్ దేశం. సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించడానికి దౌత్య, సైనిక చర్చలు కొనసాగుతున్నప్పటికీ, ఎల్ఏసీ వద్ద చైనా వ్యూహాత్మక చర్యలను కొనసాగిస్తోందని వెల్లడించింది అమెరికా నివేదిక. కేవలం భారత్తోనే కాదు, ఇతర దేశాల తోనూ కయ్యానికి కాలు దువ్వుతోంది. చైనా. ఇటీవలే తైవాన్ దేశంలోని అనుమతి లేకుండా యుద్ధ విమానాలు పంపింది డ్రాగన్ దేశం. మరో వైపు డ్రాగన్ కంట్రీలో ఓ వైపు ఆహార సంక్షోభం ఎదుర్కొంటున్నట్లు వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఇపుడు మరో ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. చైనాలోని ఉన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఒకొక్కటిగా విదేశీ టెక్ దిగ్గజ కంపెనీలు వెళ్లిపోతున్నాయి. విదేశీ సాంకేతిక సంస్థలు చైనా లో తమ కార్యకలాపాలను నిర్వహించలేమంటూ ఉపసంహరించు కుంటున్నాయి. ఫోర్ట్నైట్, యాహూ, లింక్డ్ఇన్ లతో సహా అనేక ఇతరులు భారీ కంపెనీలు చైనా నుండి నిష్క్రమిస్తున్నాయి. తాము ఇక చైనాలో కార్యక్రమాలను నిర్వహించలేమని అక్కడ నెలకొన్న పరిస్థితులే కారణమని యాహూ పేర్కొంది. చైనాలో పనిచేస్తున్న పాశ్చాత్య కంపెనీలకు అనిశ్చితి ఏర్పడింది. చైనా అతి పెద్ద మార్కెట్ అయినప్పటికీ కొత్త చట్టం లోబడి పనిచేయాల్సి రావడం టెక్ కంపెనీలకు ముళ్ళమీద పనిచేస్తున్నట్లు ఉందని మార్కెట్ నిపుణుల వ్యాఖ్య. నిజానికి యాహూకి చెందిన చాల సర్వీసులను చైనా ఇప్పటికే నిలిపివేసింది. అయితే ఇప్పుడు పూర్తి స్థాయిలో చైనా నుంచి యాహు తొలగింది. ఇప్పటికే అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్ చైనా నుంచి తప్పుకుంది. మైక్రోసాఫ్ట్కి చెందిన ప్రొఫెషనల్ నెట్వర్కింగ్ ప్లాట్ఫాం లింక్డ్ఇన్ సైతం తమ సైట్ను చైనాలో క్లోజ్ చేస్తున్నామని అక్టోబర్ లో తెలిపింది. చైనాలోని దేశీ దిగ్గజాలు సహా టెక్నాలజీ కంపెనీలపై నియంత్రణను ప్రభుత్వం ఇటీవలి కాలంలో మరింతగా పెంచుతోంది. ఇక సాంకేతికత, వాణిజ్యంపై అమెరికా ? చైనా మధ్య జరుగుతున్న గొడవలు కూడా ఈ పరిణామాలకు కారణమని తెలుస్తోంది

## నెల్లూరులో సందడిగా పులికాట్ ప్రాంతం

నెల్లూరు, నవంబర్ 6, (న్యూస్ పల్స్)పక్షుల విడిది కేంద్రం నేలపట్టు. జీవ వైవిధ్యానికి నెలవైన ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు నీటి సరస్సు పులికాట్ విదేశీ వలస విహంగాల విహారంతో అరుదైన ప్రపంచంగా కనిపిస్తోంది. చెరువు నీటిలోని కడప చెట్లపై విడిది చేస్తున్న అతిథుల కిలకిలరావాలు, ఆహార వేటలో సాగించే విన్యాసాలు పక్షి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. దశాబ్దాలుగా నేలపట్టు విదేశీ పక్షుల సంతనోత్పత్తి కేంద్రంగా భాసిల్లుతోంది. అక్టోబరు మాసం వచ్చిందంటే.. రంగు రంగుల పక్షులు వచ్చి వాలుతుంటాయి. సుమారు ఆరు నెలల పాటు ఇక్కడ విడిది చేసి సంతానోత్పత్తిని పెంచుకుని తిరిగి స్వస్థలాలకు పయనమవుతాయి. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో నేలపట్టు చెరువులతో పాటు పులికాట్కు నీళ్లు రా వడంతో వలస పక్షులు నెల ముందుగానే చేరు కుని సందడి చేస్తున్నాయి. ఒక వైపు నేలపట్టు చెరువులో విదేశీ వలస విహంగాలు గుడ్లుపెట్టి పొదుగుతుంటే పులికాట్ సరస్సులో విహంగాలు ఆహార వేట సాగిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సూళ్లూరుపేట?శ్రీహరికోట రోడ్డులో పులికాట్ సరస్సులో నీళ్లు పుష్కలంగా చేరడంతో ఫ్లెమింగోలు, పెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్స్ గుంపులు గుంపులుగా ఆహార వేటలో దర్శనమిస్తున్నాయి. సీగల్స్, చిలువలు, నీటికాకులు, నారాయణ పక్షులతో పాటు వివిధ రకాలకు చెందిన కొంగ జాతులు విపరీతంగా విడిది చేసి ఉన్నాయి. నేలపట్టును సంతానోత్పత్తి కేంద్రంగా, పులికాట్ సరస్సును ఆహార కేంద్రంగా చేసుకుని పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.ప్రపంచంలోనే అందమైన పక్షి ఫ్లెమింగో. ఈ పక్షి హంసను పోలి ఉంటుంది. శాఖాహారి. ఈ రకం పక్షులు అత్యంత అరుదుగా ఉన్నాయి. పులికాట్ సరస్సు మీద ఆహార వేటలో గుంపులు గుంపులుగా చేరి పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తాయి. ఈ పక్షులు ఆ?రస్టేలియా, రష్యా, సైబీరియా నుంచి వలస వచ్చి గుజరాత్లోని రాణాఫ్కచ్ అనే ప్రాంతంలో సంతానోత్పత్తి చేసుకుంటూ పులికాట్ సరస్సును ఆహార కేంద్రంగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ పక్షులు పులికాట్ సరస్సులో రోజుల తరబడి ఉంటాయని దీనిపై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు చెప్పారు. పులికాట్ సరస్సులో ఉండే నాచును మాత్రమే తింటుంది. ఈ పక్షి చెట్ల మీద గూళ్లు కట్టుకోకుండా నేలమీద రంధ్రం చేసుకుని గుడ్లు పెట్టి పొదుగుతాయి. హంసలు పాలను నీళ్లను వేరు చేసినట్టు ఈ పక్షి నాచు తినేటప్పుడు బురదను నాచును వేరు చేసి ఆహారంగా తీసుకోవడం దీని ప్రత్యేకత.ఆసియా ఖండంలోనే విదేశీ శీతాకాలపు వలస విహంగాల సంతానోత్పత్తి కేంద్రంగా, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంగా భాసిల్లుతుంది. 1976లో నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంగా వన్యప్రాణి విభాగం అధికారులు గుర్తించారు. ఈ కేంద్రం 458.92 హెక్టార్లలో విస్తరించి ఉంది. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో 11 రకాల పక్షులు 4 వేలకు పైబడి విడిది చేశాయి. ఇందులో గూడబాతులు (పెలికాన్) 850, నత్తగుల్ల కొంగలు (ఓపెన్బిల్ స్టార్క్స్) 2015, తెల్లకంకణాయిలు (వైట్ఐబీస్) 600, తెడ్డుముక్కు కొంగలు (స్పూన్ బిల్స్) 100, నారాయణ పక్షులు (నైట్హెరాన్) 250, నీటికాకులు (కార్మోరెంట్స్)300, చిన్న,పెద్ద స్వాతికొంగలు150 (ఈ గ్రేడ్స్), వీటితో పాటు పదుల సంఖ్యలో పాముమెడ పక్షులు (డాటర్), చుక్కకోళ్లు (కూట్స్), ఊలబాతులు (లేజర్ విజిలింగ్ డక్స్) సందడి చేస్తున్నాయి. దొరవారిసత్రం, నేలపట్టులో గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, నీటికాకులు, తెల్లకంకణాయిలు, శబరి కొంగలు వంటి పక్షులు కనిపిస్తున్నాయి. ఇక్కడకొచ్చే విదేశీ వలస పక్షుల్లో అతి అందమైన పక్షి ఫ్లెమింగో కావడంతో ఆ పక్షి పేరుతో ఏటా పండగను నిర్వహిస్తున్నారు. పులికాట్ సరస్సు, నేలపట్టులో కలిపి సుమారు 50 వేల విదేశీ వలస విహంగాలు ఇప్పటికే విచ్చేసినట్లు పులికాట్ వన్యప్రాణి సంరక్షణాధికారులు వెల్లడించారు. కుదిరి?అటకానితిప్ప గ్రామాల మధ్య సరస్సులో పర్యాటకులు విహంగాలను వీక్షించేందుకు రెండు, మూడు చోట్ల వ్యూ పాయింట్స్ ఏర్పాట్లు చేశారు.

## ఎక్స్ ప్రెస్ గా మారిన ప్యాసింజెర్లు

విజయవాడ, నవంబర్ 6, (న్యూస్ పల్స్)ఇన్నాళ్లూ పాసింజర్లుగా నడుస్తున్న పలు రైళ్లు ఎక్స్‌ప్రెస్‌లుగా మారబోతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ, గుంటూరు డివిజన్లలో దాదాపు 20 వరకు పాసింజర్లు ఇలా ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. దేశంలోని వివిధ జోన్ల పరిధిలో నడుస్తున్న పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్/మెయిల్‌లుగా మార్పు చేస్తూ తాజాగా రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. రైల్వే బోర్డు వాటి వివరాలను వెల్లడించింది. పాసింజర్ రైళ్లు గమ్యాన్ని చేరడంలో ఆలస్యమవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌ప్రెస్‌లుగా అప్‌గ్రేడ్ చేయాల్సిన పాసింజర్ రైళ్ల వివరాలను ఆయా రైల్వే జోనల్ కార్యాలయాల నుంచి రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు/సిఫార్సులు వెళ్లాయి. వాటిని అనుసరించి పలు పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్పు చేసింది. అయితే ఈ రైళ్లు ఎప్పట్నుంచి ఎక్స్‌ప్రెస్‌లుగా రూపాంతరం చెందుతాయన్నది రైల్వే బోర్డు ఇంకా స్పష్టం చేయలేదు. ప్రస్తుతం కోవిడ్ నేపథ్యంలో కొన్ని స్పెషల్ రైళ్లను మాత్రమే నడుపుతున్నారు. తిరిగి పూర్తి స్థాయిలో రెగ్యులర్ రైళ్లను నడపడం ప్రారంభించాక అప్‌గ్రేడ్ చేసిన రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా నడపుతారని తెలుస్తోంది. ఇవి ఎక్స్‌ప్రెస్‌లుగా మారితే ప్రయాణ వేగం మరింతగా పెరగనుంది. దీంతో గమ్యానికి చేరుకునే సమయం బాగా తగ్గుతుంది. ప్రయాణం కలిసొస్తుంది. కాగా ప్రస్తుతం ఆగుతున్న పాసింజర్ హాల్టుల్లో ఇకపై ఈ ఎక్స్‌ప్రెస్‌లు ఆగవన్నమాట! అయితే కొత్తగా ఎక్స్‌ప్రెస్‌లుగా మారిన రైళ్లకు పాసింజర్ హాల్టులున్న కొన్ని ముఖ్య స్టేషన్లలో హాల్ట్ ఇచ్చే అవకాశం ఉంది. ఎక్స్‌ప్రెస్‌లుగా మారగా మిగిలిన పాసింజర్ రైళ్లు మాత్రం నిర్ణీత స్టేషన్లలో యథావిధిగా ఆగుతాయి. కొత్తగా ఎక్స్‌ప్రెస్‌లుగా మారాక ఈ రైళ్లలో స్లీపర్ క్లాస్ బోగీలు, మరికొన్ని రైళ్లలో థర్డ్ ఏసీ కోచ్‌లను కూడా ఏర్పాటుతో పాటు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉండే వీలుంది

## కుళ్లిన మటన్, పాచిన హల్వా, అపరిశుభ్రం

విశాఖపట్టణం, నవంబర్ 6, (న్యూస్ పల్స్)విశాఖలో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేపట్టారు. నగరంలోని పలు హోటల్స్, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు చేసిన అధికారులు.. నిల్వ చేసిన, కలుషిత ఆహార పదార్థాల విక్రయాలపై సోదాలు జరిపారు. అనంతరం పలు హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి.. ల్యాబ్‌కు పంపిస్తున్నారు. రెండ్రోజుల క్రితం విజయవాడలోనూ ఇలాంటి మోసాలే వెలుగు చూశాయి. బార్బీ క్యూ నేషన్ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికారులే నివ్వరపోయే విషయాలు వెలుగు చూశాయి. కుళ్లిన మటన్‌ను రెస్టారెంట్ నిర్వాహకులు ఆహార పదార్థాల కోసం వినియోగిస్తున్న వైనం బయటపడింది. వారం రోజులపాటు నిల్వ ఉంచిన మటన్‌తోనే ఆహార పదార్థాలను తయారు చేసి.. వాటిని కస్టమర్స్‌కు వడ్డిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. తినడానికి వీలుగా ఉచితంగా రెస్టారెంట్‌లో జిప్ మాస్క్‌లు..అంతేకాదు? ఆహార పదార్థాల్లో నిషిద్ధ రంగులను వినియోగిస్తున్నట్టుగా కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ఇక పాడైపోయిన హల్వాను సరఫరా చేస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో తేలింది. దీంతో ఆహార పదార్థాల నమూనాలను అధికారులు సేకరించారు. వాటిని టెస్ట్ కోసం ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ రిపోర్ట్ అధారంగా రెస్టారెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రెస్టారెంట్ లోని వంట గది, స్టోర్ రూంలను పరిశీలించగా, అక్కడ సీన్ చూసి వారికి దిమ్మ తిరిగింది. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మటన్ గడ్డ కట్టుకుపోయి కుళ్లిపోయే స్థితిలో ఉంది. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, హానికర రసాయనాల చూసి అవాక్కయ్యారు. అంతేకాదు వండిన అన్నాన్ని సైతం ఫ్రిజ్‌లోనే ఉంచారు. 20 హల్వా ప్యాకెట్లపై ఫంగస్ ఉండడాన్ని గుర్తించారు. అనుమతి లేకుండా కుల్ఫీ ఐస్‌క్రీం, బేకరీ ఉత్పత్తులను తయారు చేస్తున్నారని తేల్చారు. బిర్యానీ తయారీలో సింథటిక్ రంగులను వినియోగిస్తున్నారనే అనుమానంతో నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. అలాగే కొవిడ్–19 నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో టేబుల్‌పై 8 నుంచి 10 మందిని కూర్చోబెట్టారు. సిబ్బందికి సంబంధించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు లేవు.. ఎక్కడా శానిటైజేషన్ చేయడం లేదు. ఇలా అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘిస్తూ వినియోగదారుల ఆకలిని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆ కుళ్లిన మటన్, పాచిన హల్వా, అపరిశుభ్రంగా ఉన్న బిర్యానీ తింటే జనాల ఆరోగ్యం సంగతి ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.


## నారాయణ...దూరమైనట్టేనా

నెల్లూరు, నవంబర్ 6, (న్యూస్ పల్స్)తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీఎం తర్వాత అన్నీ తానై వ్యవహరించిన మాజీమంత్రి పొంగూరు నారాయణ ఇప్పుడు బొత్తిగా కనిపించడం మానేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే నారాయణను తన కేబినెట్‌లోకి తీసుకుని కీలకమైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖను అప్పగించారు అధినేత చంద్రబాబు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధి కమిటీకి చైర్మన్‌గా కూడా పగ్గాలు కట్టబెట్టారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రంలో చక్రం తిప్పారు నారాయణ. 2019 ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆయన.. ఆ తర్వాత సొంత పార్టీకి దూరంగా ఉంటున్నారు. కనీసం పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లోనూ అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నారాయణ వ్యవహారాన్ని గమనిస్తూ వస్తున్న అధినేత చంద్రబాబు కూడా నారాయణను పక్కన పెట్టారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే అది నిజమనే అనిపిస్తోందని అంటున్నారు. ఇటీవల చంద్రబాబు ఏపీ టీడీపీ కొత్త కమిటీలను ప్రకటించారు. పార్టీ పొలిట్‌బ్యూరోలో కానీ, కేంద్ర కమిటీలో కానీ నారాయణకు చోటు కల్పించకపోవడం వెనుక వేరే కారణాలున్నాయని చెబుతున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బీదా రవిచంద్రకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పొలిట్‌బ్యూరో సభ్యులుగా నియమించారు. అబ్దుల్ అజీజ్‌కు నెల్లూరు పార్లమెంటరీ కమిటీ అధ్యక్ష పదవి కట్టబెట్టారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా చెప్పుకునే నారాయణ పేరు మాత్రం ఏ కమిటీలోనూ కనిపించక పోవడం చర్చనీయాంశమైంది. దీంతో నారాయణ టీడీపీకి దూరమయ్యారా? లేక పార్టీ మారబోతున్నారా? అసలు నారాయణ పేరును కమిటీల్లో ప్రకటించక పోవడమేంటనే ప్రశ్నలు జిల్లా రాజకీయవర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయినారాయణను పక్కన పెట్టడం వెనుక కారణాలున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒక పక్క రాష్ట్రంలో రాజధానుల రచ్చ, దేవాలయాలపై దాడులు, దళితులపై దాడులు, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు, రైతు సమస్యలు, కరోనా వంటి అనేక సమస్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు ప్రతి విమర్శలతో రాజకీయాలు హాట్‌గా సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఎక్కడా నారాయణ స్పందించడం లేదు. విద్యా సంస్థలకే పరిమితమైపోయారు. పైగా కరోనా సమయంలో టీడీపీ తరఫున కాకుండా విద్యా సంస్థల పేరు మీదనే సేవలందించారు. ఈ కారణాలతో ఆయనను పార్టీయే పక్కన పెట్టిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు నారాయణ పార్టీ మారబోతున్నారన్న ప్రచారం కూడా జోరుగా సాగింది. అమరావతి రాజధాని భూముల వ్యవహారంలో ఆయన కీలకంగా ఉన్నారు. భూముల సేకరణలో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని వైసీపీ ప్రభుత్వం అంటోంది. ఇప్పటికే ఈ భూముల వ్యవహారం నారాయణ మెడకు చిక్కుకుందని చెబుతున్నారు. మరోపక్క సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. దీంతో ఆయన కేసుల నుంచి తప్పించుకోవడం కోసం, తన ఆస్తులను కాపాడుకొనేందుకు వైసీపీలో చేరుతున్నారనే టాక్ నడుస్తోంది. ఆయన చేరికపై నెల్లూరులోని ఓ ఎంపీ అధిష్టానంతో మంతనాలు జరిపారని, ఇక ఆయన ఫ్యాన్ గూటికి నారాయణ రావడమే తరువాయనే ప్రచారమూ సాగింది. దీంతో నారాయణ పార్టీని వీడడం ఖాయమని టీడీపీ వర్గాలు భావించాయి. ఈ నేపథ్యంలోనే నారాయణను అధినేత చంద్రబాబు పక్కన పెట్టారని, అందుకే ఏ కమిటీలోనూ ఆయనకు చోటు కల్పించ లేదని చెవులు కొరుక్కుంటున్నారు. అసలు నారాయణను చంద్రబాబు దూరం పెట్టారా? అందుకే కమిటీల్లో నారాయణ పేరును ప్రకటించ లేదా? అసలు నారాయణ వాస్తవంగానే వైసీపీలోకి వెళ్తారా అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెబుతుందని ఆయన అనుచరులు అంటున్నారు.

### కుటుంబ సమేతంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి వేముల

తిరుపతి నవంబర్ 6, (న్యూస్ పల్స్)రాష్ట్ర రోడ్లు–భవనాలు,గృహ నిర్మాణ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం కుటుంబ సమేతంగా తిరుమలలో శ్రీవారిని ఉదయం బ్రేక్ దర్శనంలో దర్శించుకున్నారు. వేదాశీర్వాదాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆ వెంకటేశ్వరున్ని కోరుకున్నానని ఈ సందర్భంగా తెలిపారు.

## ఆళ్లకు చాన్స్ ఉందా ..



గుంటూరు, నవంబర్ 6, (న్యూస్ పల్స్)ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఈసారి కూడా మంత్రివర్గంలో చోటు దక్కడం కష్టంగానే కన్పిస్తుంది. జగన్ కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయనకు సామాజిక సమీకరణాల కారణంటా మంత్రివర్గంలో ఛాన్స్ లభించదంటున్నారు. అసలు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రెడ్డి సామాజికవర్గానికి మంత్రి వర్గంలో ఛాన్స్ లభించదంటున్నారు. ఈ రెండు జిల్లాల నుంచి కమ్మ, ఎస్సీ, కాపుల వంటి వారినే జగన్ మంత్రివర్గంలోకి తీసుకుంటారని చెబుతన్నారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి జగన్ కు అత్యంత సన్నిహితుడు. ఆయన సోదరుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కూడా వైసీపీలో కీలకంగా ఉన్నారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో లోకేష్ మీద ఆయన గెలిచారు. అప్పుడు ప్రచారంలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి మంత్రి పదవి ఇస్తానని జగన్ అనేక రోడ్ షోలలో చెప్పారు. దీంతో రెండో విడత ఆయనకు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. కానీ సామాజికవర్గ సమీకరణాలతో ఈసారి కూడా ఆళ్లకు ఛాన్స్ లేదంటున్నారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి జగన్ కు నమ్మకమైన నేత. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో మంత్రిపదవని సహజంగానే ఆశిస్తారు. దీనికి తోడు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారో? లేదో? తెలియని పరిస్థితి ఉంది. గత ఎన్నికల సమయంలోనే ఆయన పోటీకి దూరంగా ఉంటానని చెప్పి చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈపరిస్థితుల్లో మంత్రి పదవి ఆళ్లకు ఇవ్వాల్సిందేనని ఆయన సన్నిహితులు కోరుతున్నారు. గుంటూరు జిల్లాలో అనేక మంది సీనియర్ నేతలున్నారు. అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ముస్తాఫా వంటి నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో అంబటి రాంబాబు, ముస్తాఫాలకు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. మైనారిటీ కోటా కింద ఈసారి ముస్తాఫాకు ఇచ్చి, అంబటి రాంబాబును కూడా మంత్రివర్గంలోకి జగన్ తీసుకుంటారని తెలుస్తోంది. దీంతో జగన్ ఈసారి కూడా ఆళ్ల రామకృష్ణారెడ్డి కి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదన్నది పార్టీలో జరుగుతున్న చర్చ.

## ఈ సారి చావో...రేవో

తిరుపతి, నవంబర్ 6, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి వరస ఓటములు కుంగదీస్తున్నాయి. ఏ ఎన్నికలోనూ ఆ పార్టీకి విజయం లభించ లేదు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఏమాత్రం టీడీపీ ప్రభావం చూపలేకపోయింది. పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. తిరుపతి ఉప ఎన్నికల్లో పోటీ చేసి భంగపడింది. బద్వేలు ఉప ఎన్నికలకు పోటీకి దూరంగా ఉంది. ఇక తాజాగా 12 మున్సిపాలిటీలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో కనీస పనితీరు కనపర్చకపోతే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తలెత్తుకోలేరు. ఇప్పటి వరకూ దమ్ముంటే ఎన్నికలకు వెళదాం అని సవాల్ విసిరిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో కనీస స్థానాలు గెలుచుకుని ప్రజలు తనవైపు చూస్తున్నారని చెప్పుకోవాల్సి ఉంటుంది. పన్నెండు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికలు మూడు ప్రాంతాల్లో జరుగుతుండటంతో దీనిని మినీ సమరంగానే చూడాల్సి ఉంటుంది. ఇన్నాళ్లూ నామినేషన్లు అడ్డుకున్నారని ఆరోపించిన చంద్రబాబుకు ఇప్పుడిక ఆ ఆరోపణ చేసే అవకాశం లేదు. అన్ని మున్సిపాలిటీలు, నెల్లూరు కార్పొరేషన్ లో లెక్కకు మించి నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం మున్సిపాలిటీలో వైసీపీ కంటే టీడీపీ అభ్యర్థులే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేయగలిగారు. దీంతో ఆ ఆరోపణకు ఇక విలువ లేకుండా పోయింది. అందుకే చంద్రబాబు ఈ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే అన్ని చోట్లా టీడీపీ అభ్యర్థులకు నిధుల సమస్య తీవ్రంగా ఉంది. పార్టీ వైపు అభ్యర్థులు నిధుల కోసం చూస్తున్నారు. స్థానిక ఇన్ ఛార్జుల పైనే చంద్రబాబు భారం మోపారు. దీంతో వారు ఎంత వరకూ ఆర్థికంగా అభ్యర్థులకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతిరోజూ అన్ని జిల్లాల నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ లు నిర్వహిస్తూ ధైర్యం చెబుతున్నా అసలు విషయాన్ని దాటవేస్తున్నారంటున్నారు. మొత్తం మీద ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కనీస పనితీరును చంద్రబాబు కనపర్చకపోతే వైసీపీ మీద మరో కొత్త ఆరోపణను వెతుక్కోవాల్సి ఉంటుంది.

## బాబు అసహనం రీజనేంటి...

విజయవాడ, నవంబర్ 6, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది. అయితే ఆయన ఇటీవల కాలంలో కొంత అసహనానికి గురవుతూ అదుపుతప్పుతున్నారు. దీపావళి రోజు మీడియా సమావేశంలో ఆయన చేసిన కామెంట్లే ఇందుకు నిదర్శనం. దీపావళి పండుగకు, హిందువుల మనోభావాలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు ముడిపెడుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ హిందూ ద్రోహి అని అందుకే నామినేషన్లను దీపావళి రోజునే ఉంచేలా ఎన్నికల కమిషన్ కు సూచనలు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా, అదే క్రిస్మస్ పండగకు ఇలాంటి ధైర్యం చేస్తారా? అని చంద్రబాబు ప్రశ్నించడం చర్చనీయాంశమైంది. అంటే క్రిస్టియన్లకు మాత్రమే జగన్ అండగా ఉంటున్నారని, హిందువులకు అన్యాయం చేస్తున్నారన్నది చంద్రబాబు అభిప్రాయంగా ఉంది. గతంలో నూ దళితులపైన చంద్రబాబు ఇలాంటి కామెంట్లు చేసి వివాదంగా మారారు. ఆంధ్రప్రదేశ్ లో దళితులు గంపగుత్తగా వైసీపీకి ఓట్లు వేస్తారన్న దుగ్దతో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేసి ఉండవచ్చు. అయితే దళితుల్లోనూ తెలుగుదేశం పార్టీని అభిమానించే వారున్నారని చంద్రబాబు గుర్తించలేదు. తన పార్టీలో ముఖ్యమైన పదవుల్లోనూ ఆయన దళితులను నియమించారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలతో రాజకీయంగా ఇబ్బంది అని, దళితులు టీడీపీకి మరింత దూరమవుతారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. చంద్రబాబు పూర్తిగా అసహనంలో ఉన్నట్లు కన్పిస్తుంది. ఈ ప్రభుత్వం దిగిపోవాలని ఆయన బలంగా కోరుకుంటున్నారు. వరసగా ఎన్నికలు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని ఫీల్ అవుతున్నారు. మూడేళ్ల సమయం ఉందన్న విషయాన్ని మర్చి పోతున్నారు. పార్టీని మూడేళు కాపాడుకోవడమెలా? అన్న దానిపై ఆయన పడుతున్న టెన్షన్ తో అదుపు తప్పుతున్నారని భావిస్తున్నారు.

# లెఫ్ట్ పార్టీల దారెటు

విజయవాడ, నవంబర్ 6, (న్యూస్ పల్స్)లెఫ్ట్ పార్టీలు రూటు మార్చాయి. ఇన్నాళ్లూ ప్రజాసమస్యలపై పోరాడిన లెఫ్ట్ పార్టీలు ఇకపై గెలుపు కోసమే అడుగులు వేస్తున్నట్లు కన్పించాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో సీపీఐ ఇదే దారిలో పయనిస్తుందని చెప్పవచ్చు. సీపీఐ నేత రామకృష్ణ ఫక్తు పార్టీని టీడీపీ అనుబంధ సంస్థగా మార్చేశారన్న విమర్శలు ఆ పార్టీ నుంచే విన్పిస్తున్నాయి. నిజానికి లెఫ్ట్ పార్టీలు ఇప్పటి వరకూ అధికార పార్టీ వైపు ఎప్పుడూ లేకపోయినా ప్రజాసమస్యలపై దృష్టిపెట్టేవి. 2019 ఎన్నికల్లో సీపీఐ జనసేనతో జట్టు కట్టింది. అయితే ఒక్క స్థానంలోనూ గెలవలేకపోవడం, పవన్ కల్యాణ్ తన దారి తాను చూసుకోవడంతో సీపీఐ రామకృష్ణ తెలుగుదేశం పార్టీతో జత కట్టాలని భావించారు. అందుకు అమరావతి రాజధాని సమస్యను ఎంచుకున్నారు. రాజధానిలోనే అన్నీ ఉండాలని ఆయన చెప్పడంతో సీమలోని సీపీఐ విభాగంలో వ్యతిరేకత వ్యక్తమయింది. ముఖ్యంగా కర్నూలు జిల్లా నేతలు కర్నూలు లో న్యాయరాజధాని ఉండాలని తీర్మానం చేయడం విశేషం.అయితే సీపీఐ నేత రామకృష్ణ ఎక్కడా తగ్గడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలోనూ తెలుగుదేశం పాటనే ఆయన కూడా అందుకున్నారు. మరో పక్షమైన సీపీఎం ప్రభుత్వంతో సంప్రదించాలని చెబితే, సీపీఐ మాత్రం తిరిగి ఫ్రెష్ గా ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించాలని కోరడం విశేషం. అయితే సీపీఐ రామకృష్ణ ముందుచూపుతోనే వ్యవహరిస్తున్నారని అర్థమవుతుంది. పార్టీకి భవిష్యత్ ఉండాలంటే తెలుగుదేశం పార్టీతో చెలిమి తప్పనిసరి అని ఆయన డిసైడ్ అయ్యారు.వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఎటూ పొత్తులతోనే ముందుకు వెళతారు. తొలి నుంచి తమతో ఉన్న సీపీఐకి చంద్రబాబు ఖచ్చితంగా ప్రాధాన్యత ఇస్తారు. జగన్ పై వచ్చే వ్యతిరేకత సీపీఐకి శాసనసభలో ప్రాతినిధ్యం దొరుకుతుందని రామకృష్ణ అంచనా వేస్తున్నారు. చంద్రబాబుతో బీజేపీ, జనసేన కలిసే అవకాశాలు తక్కువగా ఉండటంతో తామే ప్రధాన మిత్రపక్షంగా వ్యవహరించవచ్చన్నది ఆయన దూరాలోచన. అందుకే సీపీఐని టీడీపీకి అత్యంత చేరువ చేసే పనిలో ఉన్నారు రామకృష్ణ. మరి ఆయన స్ట్రాటజీ వర్క్ అవుట్ అయితే వచ్చే ఎన్నికల్లో సీపీఐ కొన్ని స్థానాలైనా దక్కించుకుంటుందో? లేదో? చూడాలి.

# తిరుమలలో ప్రముఖులు

తిరుమల నవంబర్ 6, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారిని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు.. ఇవాళ ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో సినీనటుడు రాజేంద్రప్రసాద్, సినీ డైరెక్టర్ గోపిచంద్ లు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా..ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన సినీ డైరెక్టర్ గోపిచంద్ మీడియాతో మాట్లాడుతూ.. కలియుగ వైకుంఠనాథుడు శ్రీనివాసుడి ఆశీస్సులు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు..స్వామి వారి ఆశీస్సులు తమ కుటుంబంపై, సినీ ఇండస్ట్రీపై ఉండాలని, నందమూరి బాలకృష్ణతో నూతన చిత్రం చిత్రీకరణకు త్వరలో పూజ నిర్వహించనున్నట్లు గోపిచంద్ వెల్లడించారు..

# ఓటమి తో టిడిపి నాటకాలు

నెల్లూరు నవంబర్ 6, (న్యూస్ పల్స్)నెల్లూరు కార్పోరేషన్ లో ఓటమి తప్పదని,వైసిపి పై తమ పై టిడిపి నేతలు రవిచంద్ర,అజీజ్ లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎపి ఇరిగేషన్ మంత్రి అనిల్ ఫైర్ అయ్యారు.వైసీపీ జెండా ఎగరడం ఖాయం అని,నెల్లూరు కార్పొరేషన్ లోని 54 డివిజన్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలవ బోతున్నారని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు ..ఎన్నికల హామీల్లో ఇప్పటికే 97% హామీలను ఇప్పటికే పూర్తి చేశామనని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రచారానికి ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారని మంత్రి వివరించారు..

# సైనికుల వద్ద లంచం తీసుకొన్న రెవిన్యూ సిబ్బంది

అనంతపురం నవంబర్ 6, (న్యూస్ పల్స్)దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికులు దగ్గర కూడా ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకెళితే అమరాపురం మండలం ఉదుగురు గ్రామానికి చెందిన నరసింహమూర్తి బీఎస్ఎఫ్ జవాన్. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్నాడు. .వ్యక్తిగత సెలవుల నిమిత్తం ఊరికి రావడం జరిగింది. అందులోనే ఇంటికి సంబంధించిన డీ ఫారమ్ కాపీ తీసుకోవడానికి అమరాపురం మండలం లో తహశీల్దారు కార్యాలయానికి వెళ్లాడు. .అక్కడ పని చేస్తున్న అటెండర్ శివన్న సంప్రదించి వివరాలు చెప్పాడు. అతను ఆ పట్టా కాఫీ ఇవ్వడానికి ఆరువేల రూపాయలు లంచం అడిగాడు. అందుకు సోల్జర్ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల దగ్గర లంచాలు తీసుకోవడం ఏంటి సార్ అని ప్రశ్నించాడు. అవి పాత ఫైలు వెతకడానికి చాలా కష్టంగా ఉంటుంది నేను అడిగిన అమౌంట్ ఇస్తే మీరు ఫైలును వెతికి ఇస్తానని శివన్న అన్నాడు. అందుకు సోల్జర్ ఆరు వేల రూపాయలు అయితే ఇవ్వలేను. రెండు వేలు ఇస్తానని చెప్పి ఇచ్చాడు. బార్డర్ లో పనిచేసేటువంటి ఒక సైనికుని దగ్గరనే ప్రభుత్వ అధికారులు లంచం తీసుకోవడం చాలా దారుణంజ నాకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని దయచేసి దీనికి న్యాయం చేయమని నరసింహమూర్తి అంటున్నాడు

# అంతా మా ఇష్టం...అంతా మా ఇష్టం, ఎడపెడా పగులకొట్టేస్తాం

నూజివీడు నవంబర్ 6, (న్యూస్ పల్స్) కృష్ణాజిల్లా నూజివీడు మండలం అన్నవరం శివారు వేంకటాద్రిపురం గ్రామ పంచాయతీలోని జడ్పి భవనాన్ని స్థానిక నేతలు కూల్చి వేయినీచారు. అనాది కాలంగా గ్రామంలో సమావేశాలకు, విడిది భవనంగా సేవలు అందించిన జడ్పి భవనం ఇప్పుడు కూలిపోయింది. గ్రామ ప్రజలు,పెద్దల అభిప్రాయాలు,నాయకుల తీర్మానంతో పని లేకుండా ఇష్టానుసారంగా జడ్పి భవనంను కూల్చివేయించారని స్థానికులు ఆరోపించారు. ఓట్లు కోసం ప్రజల ఇళ్ల చుట్టూ తిరిగిన నాయకులు, గ్రామంలో భవనం కూల్చి వేరొక కార్యాలయ స్థాపనకు పునుకునే ముందు గ్రామస్తుల అనుమతితో పని లేదా అని ప్రశ్నిస్తున్నారు.

# సగర్వంగా ప్రజల ముందుకు ..

నందిగామ నవంబర్ 6, (న్యూస్ పల్స్)ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నాలుగేళ్లు అయిన సందర్భంగా ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నందిగామ పట్టణంలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేసారు ,ముందుగా పార్టీ కార్యాలయం నుండి పాదయాత్ర ప్రారంభించి గాంధీ సెంటర్లోని మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ,కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు ,ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ జననేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు మార్చిందని తెలిపారు ,ముఖ్యమంత్రి వైయస్ జగన్ అందిస్తున్న ప్రజా సంక్షేమ -అభివృద్ధి కార్యక్రమాలతో సగర్వంగా ప్రజల ముందుకు వెళ్తున్నామన్నారు ,రాష్ట్రమమతా 13 జిల్లాలు దాదాపు 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజల కష్టాలను తెలుసుకుని , అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజలకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ -అందించిన పథకాలను ప్రజల్లోకి వెళ్లి వివరించిన ఘనత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు .అభివృద్ధి ,సంక్షేమం రెండు కళ్లు ..ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి- సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్నారని ,సీఎం జగన్ సహకారంతో నందిగామ నియోజకవర్గంలో

పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ,ఇప్పటికే గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరిగిందని ,అదేవిధంగా అర్హులైన ప్రజలకు ప్రభుత్వ అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేసి వారికి లబ్ధి చేకూరుస్తున్నామన్నారు ,పాదయాత్రకు విశేష స్పందన ..అరుణ్ కుమార్ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది ,పాదయాత్ర సందర్భంగా నందిగామ పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది ,పార్టీ నాయకులు- కార్యకర్తలు టపాసులు కాల్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు , అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ..

# అటెన్షన్...అంతా కుప్పం మీదే

తిరుపతి, నవంబర్ 6 ఏపీ రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. ఇప్పుడు స్టేట్ అటెన్షన్ మొత్తం.. కుప్పం మీదే ఉంది. కుప్పంలో రాజకీయం కుత కుత ఉడికిపోతోంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఎన్నికలు జరుగుతుండడంతో.. ఏపీ ఫోకస్ అంతా అక్కడికే షిఫ్ట్ అయ్యింది. ఇప్పటికే.. టీడీపీ, వైసీపీ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. విమర్శలు.. ప్రతి విమర్శలు.. సవాళ్లు.. ప్రతి సవాళ్లతో కుప్పంలో పొలిటికల్ హీట్ పెరిగుతోంది. కుప్పం బహిరంగసభలో.. మంత్రి పెద్దిరెడ్డి చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. తనను కుప్పంకు రావొద్దని చెప్పేందుకు.. చంద్రబాబుకు ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. 35 ఏళ్లుగా కుప్పం నుంచి గెలుస్తున్న బాబు.. ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఉపాధి లేక కుప్పం నుంచి 25 వేల మంది వలస వెళ్లిపోయారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎలక్షన్ జరిగే లోగా.. కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు తెస్తామన్నారు.ఇక.. 14వ వార్డు టీడీపీ ఎస్సీ అభ్యర్థి వెంకటేష్పై జరిగిన దాడి.. కుప్పంలో ఉద్రిక్త వాతావరణాన్ని క్రియేట్ చేసింది. దుండగులు అతని నామినేషన్ పత్రాలను కూడా లాక్కెళ్లారు. ఈ ఘటనపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్కు లేఖ రాశారు. వైసీపీకి చెందిన 30 మంది వెంకటేశ్ని కొట్టారని ఆరోపిస్తూ.. దాడికి సంబంధించిన ఫోటోలను లేఖకు జత చేసి పంపారు. హైకోర్టు ఆదేశాల మేరకు.. ముప్పు పొంచి ఉన్న అభ్యర్థులకు భద్రత కల్పించాలన్నారు. తక్షణమే కుప్పం ఎన్నికల్లో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఇక.. కుప్పం మున్సిపాలిటీపై ఎగిరేది తమ జెండానే అని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సభలో వైసీపీ ఎంపీ రెడ్డప్ప కీలక వ్యాఖ్యలు చేశారు. తాము ఓడితే.. వైసీపీ నేతలెవరూ కుప్పంలో అడుగుపెట్టబోమన్నారు. అదే.. టీడీపీ ఓడితే చంద్రబాబు రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని సవాల్ విసిరారు. చంద్రబాబుకు కుప్పంలో ఇల్లు, ఓటర్ లిస్ట్ లో పేరు కూడా లేదన్నారు. కుప్పంలో ఉన్న 25 వార్డులకు 125కు పైనే నామినేషన్లు దాఖలయ్యాయి. మున్సిపాలిటీ ఎన్నికల బాధ్యతలను.. టీడీపీ తరపున పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చూస్తున్నారు. వైసీపీ తరఫున ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే వెంకటగౌడ పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా త్రిలోక్ బరిలోకి దిగుతుండగా.. వైసీపీ తరఫున డాక్టర్ సురేశ్ ఉన్నారు.

# పూతలపట్టు ఎమ్మెల్యే నోరు అదుపులో పెట్టుకోవాలి!

చిత్తూరు నవంబర్ 6 పూతలపట్టు ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. కుప్పం లో జరిగిన బహిరంగ సభలో పూతలపట్టు ఎమ్మెల్యే కనీస రాజకీయ పరిజ్ఞానం లేకుండా 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడు గారి పైన పచ్చి బూతులు మాట్లాడటం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నికి విరుద్ధం. ముఖ్యంగా కుప్పంలో నీకు ఓటు ఉందా? నీకు ఇల్లు ఉందా? అని చంద్రబాబు నాయుడు గారిని ప్రశ్నించిన బాబు.. ముందు తనకి పూతలపట్టులో ఓటు, ఇల్లు ఉందా? అని సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తున్నాం. కనీస రాజకీయ పరిజ్ఞానం లేకుండా కుప్పంలో 7 సార్లు గెలిచిన వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు గారి పైన బూతులు మాట్లాడటం, ఇదే వేదిక పైన ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ముఖ్య మంత్రి నారాయణస్వామి చోద్యం చూస్తుండటం సిగ్గు చేటు. తన సొంత గ్రామ పంచాయతీలో సర్పంచ్ గా ఓడిపోయినా,

**లేకుంటే తీవ్ర పరిణామాలు టిడిపి నాయకుల హెచ్చరిక!**

జడ్పీటీసీ గా ఓడిపోయినా, ఈ రోజు పూతలపట్టు లో 30 వేలతో గెలిపిస్తే ప్రజలకు సేవ చేయకుండా బూతులు మాట్లాడటం చాలా దురదృష్టకరం. విచిత్రం, ముందుగా తన పైన తన సొంత పార్టీ జెడ్పిటిసి చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పి ,తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలుగుదేశం పార్టీ గా డిమాండ్ చేస్తున్నాం. పూతలపట్టు ఎమ్మెల్యే తన పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలుగుదేశం పార్టీ గా హెచ్చరిస్తున్నాం.ఈ పత్రికా విలేకరుల సమావేశంలో టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజు, టిడిపి క్రిస్టియన్ సెల్ ప్రెసిడెంట్ మేషాక్, తవనంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు దిలీప్ నాయుడు, చిత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు శశికర్ బాబు, మండల జనరల్ సెక్రటరీ మధు యాదవ్ ,టిడిపి నాయకులు రాజా, మండల ఎస్సీసెల్ ప్రెసిడెంట్ కుప్పయ్య, కుమార్ ,జైపాల్, పాల్గొన్నారు

# రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోంది

**ప్రజా సంకల్పయాత్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా.**



కడప, నవంబర్ 6 సంక్షేమం, అభివృద్ధి.. అనేవి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు.. అని, ప్రస్తుతం రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని హెడ్ పోస్టాఫీస్ సమీపంలోని వైఎస్ఆర్ సర్కిల్ లో నాలుగేళ్లు పూర్తిచేసుకున్న వైఎస్ఆర్ పార్టీ ప్రజాసంకల్ప యాత్ర ఆవిర్భావ దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి.. ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం భారీ కేకును కట్ చేసి పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ 2017లో అప్పటి ప్రభుత్వ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర, నేటితో నాలుగేళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఆ నాడు యువనేత జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఫలితంగా.. ఈనాడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి.. రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నారన్నారు. 'అభివృద్ధి అంటే నిన్నటి కంటే నేడు బావుండటం.. నేటి కంటే రేపు మరింత బావుంటుందని నమ్మకం కలిగించడం' అని సరికొత్త నిర్వచనం చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పాలనలో పారదర్శకత, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను 95% శాతం పూర్తిచేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా.. గ్రామసీమల్లో ఇంటిముందుకే వచ్చిన సంక్షేమాన్ని చూసి ప్రజలు జగన్ను గుండెల్లో నింపుకుంటున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీ వర్గాల ప్రజలకు రాజ్యాధికారంలో సమన్యాయం అందివ్వడంతో.. అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు.. అనంతరం వాటి పనితీరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన దక్షతపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్కే దక్కుతుందన్నారు. ప్రతి పథకానికి నిర్ణీత కాల వ్యవధిలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా.. అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో యువతకు లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిదే అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్, నిత్యానంద రెడ్డి, పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నగర కార్పొరేటర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, వైఎస్ఆర్ సిపి అభిమానులు పెద్ద ఎత్తున హాజరై.. సంబరాలు జరుపుకున్నారు.

# పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి

**కమిషనర్ దినేష్ కుమార్**

నెల్లూరు నవంబర్ 06 నగర పాలక సంస్థ పాలక మండలి సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 15 వ తేదీన జరిగే పోలింగ్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ అందించామని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక వై.ఎమ్.సి.ఏ మైదానంలోని వి.ఆర్.ఐ.పి.ఎస్ కేంద్రంలో జరుగుతున్న శిక్షణా తరగతులను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 54 డివిజన్లకు 471 నామినేషన్లు దాఖలు అయ్యాయని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 8 వ తేదీన అభ్యర్థులను ఖరారు చేస్తామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది శిక్షణలో బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, ఓటర్ ఐ.డి పరిశీలన, ఓటు వేయించే విధానం, మార్కింగ్ షీట్ల నిర్వహణ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఓటు హక్కు వినియోగం కోసం ఏర్పాటు చేస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై స్పష్టమైన నిర్దేశకాలను సూచించి, ఎన్నికల సిబ్బంది మొత్తం ఓటు వేసేలా పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ వెల్లడించారు. మొత్తం 1100 మంది సిబ్బందికి శిక్షణ అందించామని, పోలింగ్ సరళిని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని వివరించారు.

# వైసీపీ ఆగడాలకు బలైన దళిత యువతి

**ప్రేమించానని చెప్పి నీలి చిత్రాలను తీసిన కార్యకర్త**

**నీలి చిత్రాలును తీసి గ్రామస్తులకు బంధువ్రులకు పంపడం తో యువతి ఆత్మహత్య**

శ్రీకాకుళంనవంబర్ 6, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ కార్యకర్తల ఆగడాలు మహిళలు,యువతులు బలవుతున్నారు. వీరఘట్టం మండలం నడుకురు సంఘటన మరువక ముందే రేగిడి మండలం కొత్త చెలికానివలస గ్రామంలో మరొక సంఘటన చోటుచేసుకుంది. వైకాపాలో తిరుగుతున్న యువకుడు దళిత యువతిపై దుర్మార్గానికి పాల్పడ్డాడు. ప్రేమించానని నమ్మించి నీలిచిత్రాలను చిత్రీకరించాడు. మద్యం మత్తులో నీలి చిత్రాలను కుటుంబీకులకు పంపాడు. భయంతో మనస్థాపానికి గురై యువతి ఉరి వేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. రేగిడి మండలం, చెలికానివలస లో ఆలస్యంగా వెలుగుచూసింది ఈ ఘటన. పూడ్చి పెట్టిన శవానికి రీపోస్టుమార్టం పోలీసుల చేశారు..

# కలకడ, బంగారుపాళెం జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

చిత్తూరు నవంబర్ 6చిత్తూరు జిల్లాలోని బంగారు పాళ్యం, కలకడ మండలాలకు సంబంధించిన జెడ్పిటిసి ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు శుక్రవారం నాడు దాఖలు చేసుకున్న నామినేషన్ పత్రాలు సక్రమంగా లేవని అందువల్ల వారి దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం ఎస్ మురళి ప్రకటించారు. బంగారుపాళ్యం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన గిరిబాబు అఫిడవిట్ వీటిలో కాలం సంఖ్య5(9), సదరు అభ్యర్థి ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రంలో రుణం క్లియర్ కాలేదని ప్రత్యర్థి అభ్యంతరంతెలిపారు. అదేవిధంగా కలకడ మండలం టిడిపి అభ్యర్థిగా నామినేషన్ ను దాఖలు చేసిన సురేఖ దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫారంలో నమోదు చేసిన పుట్టిన తేదీ,కుల ధ్రువీకరణ లోఇచ్చిన పుట్టినతేది , ఆధార్ కార్డు లో గల తేదీలు వేరు వేరుగా ఉన్నాయని, వయస్సు నిర్ధారణ కు సంబంధించి ధ్రువీకరణ సమర్పించలేదు. డిక్లరేషన్ ఫారం లో దరఖాస్తు కు సాక్షి సంతకం చేసిన వారి అడ్రస్ వ్రాయలేదు. పొదుపు సంఘం లో రెండవ లీడర్ గా వుంటూ రుణం క్లియర్ చేయలేదని,అందుకు సంబంధించిప్రత్యర్థి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ సమక్షంలో నవంబరు 07 తేదీ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 లోపల అప్పీలు చేసుకోవచ్చునని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారి తో పాటు, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఏ ఆర్ వో లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల16 న జరిగే నిరసన దీక్షలో పాల్గొనండి- ఆర్.సి.సి పిలుపు

ఎమ్మిగనూరు నవంబర్ 6రాయలసీమ అభ్యున్నతి కోసం జరిగిన శ్రీబాగ్ ఒప్పందాన్ని యధాతదంగ అమలు చేయాలంటూ ప్రజా సంఘాల ఆద్వర్యంలో ఈ నెల కర్నూలు పట్టణంలో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం దగ్గర జరిగే నిరసన దీక్షలో రాయలసీమ ప్రజాసంఘాలు, రాయలసీమ వాదులంతా పాల్గొనాలని రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమ కరపత్రాలు ఆదోని లోని భీమాస్ హోటల్ లో ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యేశించి రాజు మాట్లాడుతూ.. మద్రాసు నుండి బాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో తెలుగు రాష్ట్రం ఏర్పడేటప్పుడు అప్పటికే కృష్ణ డెల్టాలో సమృద్ధిగా పండే పంటలతో ఎలాంటి ఇబ్బందులులేని కోస్తా ప్రాంతంతో దుర్భిక్షమైన రాయలసీమ ని కలపడం కొంత అనుమానించాల్సిన విషయమని రాయలసీమ పెద్దలు గ్రహించి చేసుకున్న ఒప్పందమే శ్రీబాగ్ ఒప్పందంగా చరిత్రలో నిలించిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం.. చట్టసభలో సమాన వాటా, నీళ్లలో వాటా, యూనివర్సిటీ విద్యలో సమానత్వం, అన్నింటికీ మించి రాజధాని నిర్ణయంలో రాయలసీమ వాళ్లదే నిర్ణయం అన్నది ప్రధానంగా చేసుకున్న ఒప్పందమని అన్నారు. దీనికి కోస్తా పెద్దలు కూడా అంగీకరించి ఒప్పుకున్నాకనే ఇది అమలు చేయాలని నిర్ణయం జరిగింది అని అన్నారు. కానీ నేడు రాయలసీమ లో ఉన్న పరిస్థితి అందరికి కళ్ళకు కట్టయినట్లు కనపడుతుందని అన్నారు. నీళ్లలో వాటా లేక, నిధులల్లో వాటా లేక, ఉన్నత విద్యలేక, రాయలసీమ మొత్తం ఒక కరువు ప్రాంతంగా చరిత్రలో నిలిచిందని అన్నారు. రాయలసీమ వాసులకు పదవుల పందేరం వేసి, నీళ్లు మాత్రం వాళ్ళు తీసుకున్న, ఇక్కడ ప్రజల ఓట్లతో పదవులు పొందిన నేతలు మాత్రం కోస్తా పెద్దలకు ఊడిగం చేస్తున్నారని ఇది సహించరాని నేరం అన్నారు. ఈ వెనుకబాటుతనానికి అన్ని రాజకీయ పార్టీలు కారణమని,తిరిగి వెనుకబాటు తనాన్ని రూపు మాపాలంటే అందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ప్రజలందరూ లక్షల సంఖ్యలో వలస పోతుంటే నాయకులు మాత్రం తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడం కోసం అర్రులు చాస్తున్నారని ఇది దుర్మార్గం అని,దీన్ని ఇంకా ఎన్నో రోజులు రాయలసీమ లోని ప్రజలు సహించరాని అన్నారు. రాయలసీమ లోని అన్ని ప్రజాసంఘాల నాయకులు ఇకనైనా కలిసి ఐక్య ఉద్యమాలకు ఊపిరి పోయాలని, ఒకవేళ వేరు వేరుగా కొనసాగిన దెబ్బ మాత్రం కలిసే కొట్టాలని పిలుపునిచ్చారు. అందుకే ఈ నెల 16 న కర్నూలో నగరంలో జరిగే నిరసన దీక్ష సందర్భంగా అందరం కలిసి రాయలసీమ రాష్ట్ర డిమాండ్ చెయ్యాల్సిన అవసరం ఉందని అన్నారు. రాయలసీమ రాష్ట్రం అయితే తప్ప ఇక్కడ ప్రజలకు జీవనం లేదని, యువతకు ఉద్యోగాలు లేవని, భూములకు నీళు రావని, అందుకే ఉద్యోగ,విద్యార్థి, మేధావి, వర్గాలు ఈ దీక్షకు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖీఅఅ నాయకులు అనిల్, రవివర్మ, రామంజి, లోకేష్, సీమ విద్యార్థి సంఘం నాయకులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్ పోర్ట్, కొరియర్ కార్యాలయాలు, గోడౌన్ లలో పోలీసుల తనిఖీలు

కడప నవంబర్ 06 కడప జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్ పోర్ట్, కొరియర్ సంస్థల కార్యాలయాలు, గోడౌన్ లలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు.



నిషేధిత వస్తువుల రవాణా పై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోని ట్రాన్స్పోర్ట్, కొరియర్ సంస్థలలోని సరకుల వివరాలను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడయినా అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని జిల్లా ఎస్.పి సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదే..

## నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు. నవంబర్ 06 ( విభారె) నాలుగు సంవత్సరాల క్రిందట ప్రజా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఓ మేలిమలుపుగా నిలిచిందని నందికొట్కూరు శాసనసభ్యులు తొగురు ఆర్తర్ అన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నందికొట్కూరు వైయస్సార్ సిపి పార్టీ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, ఉర్దు అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ షూకూరుమియ్య, మున్సిపల్ కౌన్సిలరు ఉండవల్లి ధర్మా రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బాలస్వామి, వైసీపీ మహిళ విభాగం తాలూకా కన్వీనర్ వనజ, పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు ముగిసిన సందర్భంగా విజయోత్సవ కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర చారిత్రాత్మకమన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో 14 నెలల పాటు ప్రజలతో కలిసి నడిచి వారి కష్టాలకు సంక్షేమం అభివృద్ధితో రాష్ట్ర అభివృద్ధికి నాంది పలికారన్నారు.రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమాన్ని ఓ మేలిమలుపు తిప్పిన ప్రజా సంకల్పయాత్ర లాంటి చారిత్రక ఘట్టంలో మనమంతా భాగస్వామ్యులు అయినందుకు గర్వపడుచున్నామన్నారు. గత పాలనలో నిరాశ, నిస్పృహలకు లోనై ఆందోళన చెందుచున్న రాష్ట్ర ప్రజలకు నేనున్నాను ఆంటూ ధైర్యం చెప్పి జనంతో కలసి అడుగులు వేసిన జగన్ మోహన్ రెడ్డి నేడు ముఖ్యమంత్రిగా చేస్తున్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పాదయాత్రలో తెలుసుకున్న ప్రజల కష్టాలు, వారి కన్నీళ్లను, కుంటుబడిన అభివృద్ధిని కళ్లారా చూసి విన్న ముఖ్యమంత్రి నేడు అనేక సంక్షేమ పథకాలుతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో భాగమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి రాజకీయాలు వదిలిపెట్టి ప్రజలకిచ్చిన హామీలను కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ మహానేత వైఎస్ఆర్ తనయుడిగా ముందుకు సాగుచున్నారన్నారు. రెండున్నర ఏళ్ల పాలనలో ప్రజా సంక్షేమం రాష్ట్ర ప్రగతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక నాయకుడు జగన్ మొహన్ రెడ్డేనన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థ, నిన్నగాక మొన్న 56 బీసీ కార్పొరేషన్ల ఏర్పాటుతో రాష్ట్ర సంక్షేమాన్ని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడం లో విజయం సాధించారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థలును అందుబాటులోకి తీసువచ్చి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. ఇలాంటి వ్యవస్థల అంకురార్పణ ఆలోచనలకు పాదయాత్రలోనే నాంది పడిందన్నారు.ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ ల నిర్మాణాలు జరుగుచున్నాయన్నారు.రాష్ట్ర ఖాజానా నుంచి వేల కోట్ల రూపాయలను ప్రజల దగ్గరికి నేరుగా చేర్చిన నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో ఎంఎల్ఏ గా పనిచేస్తుండడం తనకు చాలా గర్వంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు తమ్మడి పల్లి విక్టర్, పెరుమాళ్ళ జాన్, తాటిపాటి అయ్యన్న, జగన్ రఫీ , రమేష్ ,దేశెట్టి శ్రీనివాసులు , బ్రాహ్మణ కొట్కూరు వైసీపీ నాయకులు మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి, వెంకటేశ్వర్లు, దామగట్ల గ్రామ వైసీపీ నాయకులు మాధవరం యేసురత్నం , వేల్పుల నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠాలు

విశాఖపట్టణం, నవంబర్ 6, (న్యూస్ పల్స్)గంజాయి వ్యాపారం సాగిస్తున్న ముఠాలు కొత్త ఐడియాలతో ముందుకు వెళ్తున్నారు. రోజుకో కొత్త పద్ధతిలో మత్తు పదార్థాలు స్మగ్లింగ్ చేస్తూ.. అధికారులకే షాక్ ఇస్తున్నారు కేటుగాళ్లు. ఇప్పటివరకు సరుకుల మాటున.. పండ్ల లోడు మాటున.. పాల వ్యాన్లు లోపల? ఆర్టీసీ బస్సుల్లో గంజాయి అక్రమ రవాణా చేయడం చూశాం. చివరికి గ్యాస్ సిలిండర్‌లు తెస్తున్నా వాటిని కూడా క్యాప్ ఓపెన్ చేసి చూడాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఏపీ సర్కార్ గంజాయి సాగు, రవాణాపై చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఓ వైపు గంజాయి సాగు ధ్వంసం కొనసాగుతుంటే? మరోవైపు గంజాయి అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతుంది. ఏజెన్సీ నుంచి వచ్చే ఏ వస్తువునైనా అనుమానించాల్సిన పరిస్థితి నెలకొంది. తాజాగా విశాఖలో పెద్ద మొత్తంలో తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. అగనంపూడి టోల్ గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేపట్టిన సెబ్ అధికారులు.. అనుమానంతో ఐచర్ వ్యాన్‌ను ఆపి సోదాలు చేశారు. వాహనంలో తరలిస్తున్న వందల కేజీల గంజాయిని సీజ్ చేశారు.పోలీసులు గంజాయి సాగును ఏ మాత్రం ఉపేక్షించబోమన్న సంకేతాలు ఇస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికే పండిన పంటను ఎలాగైనా సరిహద్దులు దాటించడానికి ఎంతకైనా బరితెగిస్తున్నారు స్మగ్లర్లు. అమాయక గిరిజనులకు భారీ డబ్బు ఆశ చూపి గంజాయిని సరిహద్దు దాటించే బాధ్యతను వాళ్లకు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే బంగాళదుంప బస్తాల లోడు మాదిరిగా కళ్లుగప్పి అడుగున గంజాయి రవాణాకు దుండగులు యత్నించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన దువ్వాడ పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వ్యాన్, గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు

# స్పైసీ ఫుడ్స్‌కి జోడించే లవంగం గురించి అద్భుతమైన వాస్తవాలు !!



మీరు లవంగాలు వంటలకు వాడితే, దాని పరిమాణం చిన్నదే, కానీ దానిలోని ప్రయోజనాలు మాత్రం ఎక్కువ. అవి మిమ్మల్ని తప్పక ఆశ్చర్యపరుస్తాయి. .ఈ చిన్న మసాలా దినుసు వంటలో అద్భుతమైన రుచిని ఇస్తుంది. ఈ లవంగం పూల మొగ్గలను ఎండబెట్టి తయారు చేస్తారు. చారిత్రాత్మకంగా, లవంగం 1700 ఃఅ నాటిది. ఇది సంవత్సరాల క్రితం నుండి వాడుకలో ఉంది.కాబట్టి ఈరోజు లవంగం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాల గురించి ఈ కథనంలో మీరు తెలుసుకోవచ్చు.లవంగం మొగ్గలు పుష్పించే ముందు తీయబడతాయి. ఇది తెంపినప్పుడు ఆకుపచ్చగా ఉంటుంది, కానీ బాగా ఎండినప్పుడు గోధుమ రంగులోకి మారుతుంది.లవంగ చెట్టు ద్వీపాలలో కనిపించింది. పశ్చిమ ఇండోనేషియా అని కూడా పిలువబడే మెలాకాస్ ద్వీపంలో కనిపించింది. ఈ దీవుల్లోనే లవంగం చెట్టు పెరుగుతుంది. అందుకే ఇది సుగంధ ద్రవ్యాల దీవి కూడా. ఎందుకంటే లవంగం చెట్టు కొన్ని ద్వీపాలలో మాత్రమే కనిపిస్తుంది.అఫో, 400 సంవత్సరాల పురాతన లవంగం చెట్టు, మెలాకాస్‌లోని టెర్నేట్ ద్వీపంలో కనుగొనబడింది.పురుషులకు అంగస్తంభన సమస్య ఉంటే - ఈ ఫుడ్స్ కు దూరంగా ఉండాల్సిందే!పురుషులకు అంగస్తంభన సమస్య ఉంటే - ఈ ఫుడ్స్ కు దూరంగా ఉండాల్సిందే!యూజీనాల్ అనే సమ్మేళనం అద్భుతమైన నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. దీని లవంగం నూనె 80% యూజినాల్ ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు.రాత్రి పడుకునేటప్పుడు పాదాలకు తడి సాక్స్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు!రాత్రి పడుకునేటప్పుడు పాదాలకు తడి సాక్స్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు!లవంగం నూనె అద్భుతమైన కీటక వికర్షకంగా పనిచేస్తుంది. ముఖ్యంగా చీమలు మరియు చిమ్మటలను తరిమికొడుతుంది.కాబట్టి ఈ కీటకాలు మీ అల్మారాల్లో మిమ్మల్ని ఇబ్బంది పెడితే, కొన్ని లవంగాలను కాటన్ గుడ్డలో చుట్టండి మరియు కీటకాలు పారిపోతాయి.లవంగం జీర్ణ ఎంజైమ్‌లను పెంచుతుంది మరియు జీర్ణ శక్తిని ప్రేరేపిస్తుంది. కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట, వికారం మరియు వాంతులు వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది.కలరా అంటు వ్యాధి. ఇది విరేచనాలు, వాంతులు మరియు మరణానికి కూడా కారణమవుతుంది. లవంగం చాలా వ్యాధులను కలిగించే బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. అదనంగా, ఇది కలరా బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పనిచేస్తుంది మరియు దాని ప్రభావాన్ని తగ్గిస్తుంది.లవంగాలలో కనిపించే ఫినైల్‌ప్రోపియోనైడ్ అనే సమ్మేళనం యాంటీ మ్యూటాజెనిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది కణాల జన్యు పరివర్తనను నిరోధిస్తుంది మరియు క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధిస్తుంది.ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే చికిత్స చేయడానికి లవంగాలను ఉపయోగిస్తారని పరిశోధనలు చెబుతున్నాయి.లవంగాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఉండే టాక్సిన్స్ ను బయటకు పంపి కాలేయాన్ని రక్షిస్తాయి.మీ ఆహారంలో లవంగాలను జోడించడం వల్ల టైప్ 1 మధుమేహాన్ని నియంత్రించవచ్చు. ఎందుకంటే లవంగాలలోని పదార్థాలు ఇన్సులిన్‌ను ఉత్తేజపరిచి రక్తంలో అధిక చక్కెరను అదుపులో ఉంచుతాయి.రక్తంలోని తెల్లకణాలు మాత్రమే వ్యతిరేక పోరాటాలు. వారి ప్రధాన పని మీ శరీరాన్ని సూక్ష్మక్రిముల నుండి రక్షించడం. కాబట్టి మీ ఆహారంలో తిమ్మిరిని జోడించడం వల్ల తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది మరియు మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు ఇన్ఫ్లమేటరీ జెర్మ్స్ నుండి మనల్ని రక్షిస్తుంది.పంటి నొప్పి మరియు పంటి నొప్పికి లవంగం అద్భుతమైన వైద్యుడు. యూజీన్‌లో నొప్పి నివారణ మందులు మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఉత్పత్తులు ఉన్నాయి. మరియు ఇందులోని చాలా పదార్థాలు దంతాల కోసం సిమెంట్ నమూనాను రక్షిస్తాయి.



# యాంజెలీనాతో రానా ఫ్యాన్ బాయ్ మూమెంట్



రానా దగ్గుబాటి చాలా కాలంగా మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సినిమాలకు ప్రమోటర్ గా ఉన్న సంగతి తెలిసిందే. తెలుగు వెర్షన్స్ కి అతడు వాయిస్ అందించడంతో పాటు .. ప్రచారంలోనూ భాగం అవుతుండడం ఇక్కడ కనెక్టివిటీని పెంచుతోంది. ఇంతకుముందు మార్వల్ నుంచి వచ్చిన అవెంజర్స్ - ఎండ్ గేమ్.. ఇన్ ఫినిటీ వార్ చిత్రాలకు రానా విస్తృత ప్రచారం చేసారు. 2017 నుంచి అతడు హాలీవుడ్ చిత్రాలకు విస్తృత ప్రచారం చేస్తుండడం తెలిసిందే.తాజాగా మార్వల్ నుంచి విడుదలైన 25వ చిత్రం 'ఎటర్నల్స్'పై ఇప్పటికే విమర్శకులు తమదైన శైలిలో విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. ఆస్కార్ విన్నర్ అయిన చైనీస్ దర్శకుడు క్లో జావో.. ఒక గే-సూపర్ హీరోని పరిచయం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ శుక్రవారం భారతదేశంలో ఆరు భాషల్లో విడుదలైన ఎటర్నల్స్ ని స్వాగతిస్తూ దగ్గుబాటి రానా ఇన్ స్టాగ్రామ్ లో నమస్తే.. ఎటర్నల్స్ అంటూ ఛమత్కరించారు. టిక్కెట్లు కొని థియేటర్ లను నింపాలని అభిమానులను కోరారు. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా ఆంగ్లం- హిందీ- తమిళం- తెలుగు- కన్నడ- మలయాళ భాషల్లో విడుదలైంది.రానా ఇంతకుముందు 2019 సూపర్ హీరో చిత్రం 'ఎవెంజర్స్ : ఎండ్ గేమ్' తెలుగు వెర్షన్ లో విధ్వంసక విలన్ థానోస్ కు వాయిస్ ని అందించాడు. దీనికి యాదృచ్ఛికంగా ఒ.ఖీ. రెహ్మాన్ మార్వెల్ గీతానికి డబ్బింగ్ చెప్పారు. 2018లో తెలుగులో 'ఎవెంజర్స్: ఇన్ఫినిటీ వార్'కి గాత్రదానం చేశాడు. దగ్గుబాటి రానా తన ఇన్ స్టాగ్రామ్ రీల్స్ షౌట్ అవుట్ లో కాస్మిక్ ఎనర్జీని ఆయుధాలుగా మార్చే నాణ్యత కలిగిన ఎలైట్ యోధ తేనా పాత్రను పోషించిన ఏంజెలీనా జోలీకి ప్రత్యేక సూచన చేశారు. "ఏంజెలీనా నిన్ను చూసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ మేమంతా నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నామో చెప్పలేను" అని దగ్గుబాటి క్లిప్ లో చెప్పారు. తేనాతో మిక్స్ డ్ వెర్షన్ ఇది. మీరు దేనినైనా ప్రేమిస్తే దానిని రక్షిస్తారు. అన్న దానికి దగ్గుబాటి ఏమంటారంటే..అయితే నేను దానిని రక్షిస్తాను. మీరు వారిలో ఎవరినీ రక్షించలేరు" అని విలన్ వాయిస్ చెబుతుంది. దానికి దగ్గుబాటి ఇలా సమాధానమిచ్చారు. "నేను ఎవరో మీకు తెలియదు" అని అంటారు.ఐదేళ్ల క్రితం థానోస్ విశ్వంలోని సగం జనాభాను నాశనం చేశారు. చివర్లో ఏంజెలీనా మళ్లీ హలో అని చెప్పడానికి కనిపిస్తుంది. దగ్గుబాటి అభిమాని కి జోలీ నమస్తే అని సైగ చేయడం... ఆసక్తికరం. ఇక ఎటర్నల్స్ అనేది వైవిధ్యానికి సంకేతం.. ఏంజెలీనా దాని గురించి చాలా గట్టిగా మాట్లాడింది. ఎటర్నల్స్ లో స్వలింగ సంపర్కుల ప్రేమ సన్నివేశాల కారణంగా సౌదీ అరేబియా- కువైట్ -ఖతార్ లలో సినిమాపై నిషేధం విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యూస్ డాట్ కాం డాట్ ఏయు అనే వెబ్ సైట్ తో రౌండ్ టేబుల్ ఇంటరాక్షన్ సందర్భంగా ఆమె ఇలా అన్నారు. నేను విచారంగా ఉన్నాను. ఆ సన్నివేశాలను కత్తిరించడానికి నిరాకరించినందుకు మార్వెల్ విషయంలో నేను గర్వపడుతున్నాను అని అన్నారు. ఫాస్టోస్కు ఉన్న కుటుంబాన్ని ఆ సంబంధంలో అందం ప్రేమను చూడలేని ఇప్పటికీ ఉన్నఈ ప్రపంచంలో మనం ఎలా జీవిస్తున్నామో నాకు ఇంకా అర్థం కాలేదు. భూమిని రక్షించే ఎటర్నల్స్ టీమ్ కు ఒక లాటినా మహిళ (సల్మా హాయక్) నాయకత్వం వహిస్తుంది ఇందులో గెమ్మ చాన్- కుమైల్ నంజియాని- గే ఫాస్టోస్- లారెన్ రిడ్ లాఫ్ డాన్ లీ పాత్రలను పోషించిన బ్రియాన్ టైరీ హెన్రీతో సహా మరో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. . రిడ్లాఫ్ మార్వెల్ మొదటి చెవిటి సూపర్ హీరో అయిన మక్కరి పాత్రలో నటించారు

# బాలయ్య కోసం కన్నడ విలన్

బోయపాటి శ్రీనుతో చేస్తున్న 'అఖండ' సినిమా షూటింగ్ అంతా పూర్తి చేసేశాడు నందమూరి బాలకృష్ణ. ఈ సినిమా వచ్చే నెలలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. ఇక బాలయ్య ఫోకస్ గోపీచంద్ మలినేని సినిమా మీదికి మళ్లనుంది. 'క్రాక్'తో భారీ విజయాన్నందుకు గోపీచంద్.. తర్వాతి



సినిమా విషయంలో హడావుడి పడలేదు. బాలయ్యతోనూ ఓ బ్లాక్బస్టర్ తీయాలన్న పట్టుదలతో బాగా టైం తీసుకుని ఈ సినిమాకు కథ రెడీ చేస్తున్నాడు. స్క్రిప్ట్ అంతా పూర్తయిందని.. ప్రి ప్రొడక్షన్ పనులతో పాటు కాస్ట్ క్రూ ఎంపిక జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమా కోసం విలన్గా ఎవ్వరూ ఊహించని వ్యక్తిని తీసుకొస్తున్నారట. కన్నడలో హీరోగా ఊర మాస్ సినిమాలు చేసే దునియా విజయ్ని బాలయ్య-గోపీచంద్ సినిమా కోసం ఎంచుకున్నట్లు సమాచారం. అతడి కోసం పవర్ ఫుల్ విలన్ రోల్ను రెడీ చేశాడట.దునియా విజయ్ కన్నడలో మొదట చిన్న చిన్న పాత్రలే చేశాడు. ఐతే అతను హీరోగా నటించిన 'దునియా' సూపర్ హిట్ కావడంతో ఆ సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకుని తర్వాత వరుసగా సినిమాలు చేశాడు. దాదాపు నలభై సినిమాల్లో నటించిన విజయ్.. కొన్నేళ్ల ముందు ఒక దుర్ఘటనతో వార్తల్లో నిలిచాడు. అతను చేస్తున్న ఓ సినిమా కోసం ఒక చెరువులో యాక్షన్ సన్నివేశాలు తీస్తుండగా.. ఇద్దరు ఫైటర్లు నీళ్లలో మునిగి చనిపోయారు. అప్పుడు విజయ్తో పాటు చిత్ర బృందం మీద పోలీసులు కేసు కూడా పెట్టారు. తర్వాత ఈ కేసు నుంచి అతను బయటపడ్డాడు. చూడ్డానికే చాలా క్రూరంగా రఫ్గా కనిపించే దునియా విజయ్.. విలన్ పాత్రలకు బాగానే సూటవుతాడు. కన్నడ నుంచి కిచ్చా సుదీప్ లాంటి పెద్ద స్టారే తెలుగులో 'ఈగ' సినిమాలతో విలన్ పాత్ర చేసి ఎంతగానో ఆకట్టుకున్నాడు. గతంలో కన్నడ ప్రభాకర్ దేవరాజ్ లాంటి వాళ్లు తెలుగులో విలన్లుగా ఎంత పేరు తెచ్చుకున్నారో తెలిసిందే. ఇప్పుడు దునియా విజయ్ ఎలాంటి ముద్ర వేస్తాడో చూడాలి.

# క్రీడాస్ఫూర్తిని చాటుకున్న టీమిండియా.. స్కాట్లాండ్ డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లి



క్రీడాస్ఫూర్తిని చాటుకోవడంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఎల్లప్పుడూ ముందే ఉంటాడు. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు అయినా సరే మంచి ప్రదర్శన కనబరిస్తే ప్రశంసిస్తాడు. భారత జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోని తరహాలోనే జూనియర్లకు సలహాలు ఇస్తాడు కూడా. టీ20 ప్రపంచకప్-2021 టోర్నీ ఆరంభంలో పాకిస్తాన్‌తో ఓటమి పాలైనప్పటికీ.. ధోనితో పాటు కోహ్లి సైతం చిరకాల ప్రత్యర్థి జట్టును అభినందించిన సంగతి తెలిసిందే.

ఇక నవంబరు 5న స్కాట్లాండ్‌పై విజయం తర్వాత డ్రెస్సింగ్‌రూమ్‌లో కోహ్లి.. వారితో కాసేపు ముచ్చటించాడు.కెప్టెన్‌తో పాటు రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్, జస్‌ప్రీత్ బుమ్రా సహా పలువురు ఆటగాళ్లు సైతం వారితో మాట్లడారు.ఇందుకు సంబంధించిన ఫొటోలను క్రికెట్ స్కాట్లాండ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.మాకోసం సమయం కేటాయించిన విరాట్ కోహ్లి, ఆయన బృందం పట్ల గౌరవభావం మరింత పెరిగింది"అంటూ క్యాప్షన్ జతచేసింది.కాగా టీమిండియాతో మ్యాచ్‌కు ముందు రోజు మీడియాతో మాట్లాడిన స్కాట్లాండ్ కెప్టెన్ కైల్ కొయెట్జర్.. విరాట్ కోహ్లి తమ డ్రెస్సింగ్‌రూమ్ వచ్చి తమతో మాట్లాడాలని కోరిన సంగతి తెలిసిందే. టాస్ సమయంలో కోహ్లితో కలిసి నిలబడటం గొప్పగా భావిస్తానన్న అతడు.. తమ ఆటగాళ్లలో కోహ్లి మాటలు స్ఫూర్తినింపుతాయని చెప్పుకొచ్చాడు. ఇక కైల్ విజ్ఞప్తి నేపథ్యంలో కోహ్లి ఈ మేరకు స్కాట్లాండ్ ఆటగాళ్లతో ముచ్చటించడం విశేషం. కాగా స్కాట్లాండ్‌పై భారీ విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలు మరింత మెరుగయ్యాయి.

## ఇంగ్లండ్ వివాదాస్పద వ్యాఖ్యాతపై నిషేధం..!

జాత్యాహంకార ఆరోపణల నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్, వివాదాస్పద వ్యాఖ్యాత మైఖేల్ వాన్‌పై ప్రముఖ వార్తా సంస్థ బీబీసీ నిషేధం విధించింది. తమ ఛానల్‌లో ప్రసారమయ్యే "ద టఫర్స్ అండ్ వాన్ క్రికెట్ షో" నుంచి వాన్‌ను తప్పిస్తున్నట్లు శనివారం ప్రకటన విడుదల చేసింది. వాన్ బీబీసీలో గత 12 ఏళ్లుగా టెస్ట్ మ్యాచ్ విశ్లేషకుడిగా పనిచేస్తున్నాడు. 2009లో నాటింగ్హమ్‌తో మ్యాచ్ సందర్భంగా తనతో పాటు జట్టులోని పలువురు సభ్యులపై వాన్ జాత్యాహంకార వ్యాఖ్యలు చేశాడని యార్క్‌షైర్ ఆటగాడు అజీమ్ రఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీబీసీ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయమై బీబీసీ చర్యలను వాన్ పూర్తిగా ఖండించాడు. తనపై ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నాడు. 1991 నుంచి 2009 వరకు ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వాన్.. గతంలో చాలా సందర్భాల్లో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా టీమిండియా ఆటగాళ్లను టార్గెట్ చేస్తూ వాన్ చాలాసార్లు తన నోటికి పని చెప్పాడు. ఇదిలా ఉంటే, జాతి వివక్షపై కుప్పలు తెప్పలుగా ఆరోపణలు రావడంతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) యార్క్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ (వైసీసీసీ)పై సస్పెన్షన్ వేటు వేసింది. వాన్‌పై ఫిర్యాదు చేసిన రఫీక్ ఇదే కౌంటీ తరపున 2008?2018 వరకు ప్రాతినిధ్యం వహించాడు.

# లెహంగాలో గ్లోబల్ స్టార్ కొత్త కాంతులు



దీపావళిని ఒక్కో స్టార్ ఒక్కోలా సెలబ్రేట్ చేసుకున్నారు. ముఖ్యంగా కథానాయికలు సాంప్రదాయ కట్టు బొట్టుతో చీరల్లో ముస్తాబై దీపాల పండగకు కొత్త కళను తెచ్చారు. అయితే వీరందరి కంటే కాస్త డిఫరెంట్ గా ప్రయత్నించారు గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా. ఈ దీపావళి శుభ సందర్భంగా లెహంగాలో అద్భుతమైన ఫోటోషూట్ ని తాజాగా అభిమానుల కోసం షేర్ చేసారు పీసీ.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అభిమానులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ ఉత్సవంలో అందంగా అలంకరించుకుని పీసీ ప్రత్యక్షమైన తీరు అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసిందనే చెప్పాలి. ప్రస్తుతం ఇన్ స్టాలో ఫోటోగ్రాఫ్స్ వైరల్ గా షేర్ అవుతున్నాయి. బంగార లేత గోధుమరంగు రంగు లెహంగా ధరించి దానిపై పూల ముద్రణ ప్లీట్ నమూనాతో ఆ డ్రెస్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆమె దానిని హెవీ సీక్విన్డ్ - మిర్రర్ వర్క్ చోలీతో జత చేసింది. అందంగా పూల దుపట్టాతో మెరిపించింది. వెల్వెట్ గ్రీన్ కర్టెన్ దీపావళి లైట్ల నేపథ్యంతో పాటు గాలికి ఎగిరే జుట్టుతో గొప్ప తేజస్సును ప్రసరిస్తోంది పీసీ.దీపావళి వేడుకలో... మంచి కాంతి ఆనందం కలగలిపి చాలా కృతజ్ఞతతో ప్రేమతో సాగే ఉత్సవాలివి. బహుశా స్టార్స్ నుండి అత్యుత్తమ పండుగ దుస్తులలో ఒకటి లెహంగా..! అంటూ ఆనందంగా తన లెహంగాను ప్రదర్శించింది పీసీ. ప్రియాంక చోప్రా ప్రస్తుతం గ్లోబల్ స్టార్ గా వెలిగిపోతోంది. హాలీవుడ్ లో వరుసగా సిరీస్ లు సినిమాలతో బిజీగా ఉంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... పీసీ నటిగా నిర్మాతగానూ వెలుగుతోంది. ప్రియాంక చోప్రా తదుపరి సిటాడెల్ లో కనిపిస్తుంది. ఇది మల్టీ-సిరీస్ ప్రొడక్షన్. అలాగే భారీ యాక్షన్ చిత్రం మ్యాట్రిక్స్ 4 కూడా పీసీ నటిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190